


EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
గురువారం
10-04-2025
పేజీలు: 02


## ఐపీఎల్‌లో నేడు



బెంగళూరు vs ఢిల్లీ
బెంగళూరు,
రాత్రి:7.30




స్టార్ స్పోర్ట్స్,
జియో హాట్
స్టార్‌లో..

## ఐపీఎల్ పాయింట్ల పట్టిక

| టీమ్ | మ్యాచ్‌లు | విన్ | లాస్ | పాయింట్స్ |
|---|---|---|---|---|
| గుజరాత్ | 5 | 4 | 1 | 8 |
| ఢిల్లీ | 3 | 3 | 0 | 6 |
| ఆర్సీబీ | 4 | 3 | 1 | 6 |
| పంజాబ్ | 4 | 3 | 1 | 6 |
| లక్నో | 5 | 3 | 2 | 6 |
| కొల్‌కత్తా | 5 | 2 | 3 | 4 |
| రాజస్తాన్ | 5 | 2 | 3 | 4 |
| ముంబై | 5 | 1 | 4 | 2 |
| చెన్నై | 5 | 1 | 4 | 2 |
| సన్‌రైజర్స్ | 5 | 1 | 4 | 2 |




ఆరెంజ్ క్యాప్
288
ఐపీఎల్
అత్యధిక రన్స్



పర్పుల్ క్యాప్
11
ఐపీఎల్
అత్యధిక వికెట్స్

## నైట్‌క్లబ్‌లో పైకప్పు కూలిన ఘటన..

# 184కు చేరిన మృతుల సంఖ్య




కరేబియన్ దేశమైన డొమినికన్ రిపబ్లిక్ రాజధాని శాంటో డొమింగోలోని ఒక నైట్ క్లబ్ పైకప్పు కూలిన ఘటనలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం ఈ ఘటనలో మృతి చెందిన వారి సంఖ్య 184కు చేరింది. దాదాపు 155 మంది వరకూ గాయపడ్డారు. ఇంకా శిథిలాల కింద అనేక మంది చిక్కుకుపోయారు. వారిని రక్షించేందుకు రెస్క్యూ బృందాలు శ్రమిస్తున్నాయి.జెట్‌సెట్ క్లబ్‌లో మంగళవారం తెల్లవారుజామున 12:44 గంటల సమయంలో ప్రసిద్ధ మురాంగే గాయకుడు రూబీపెరెజ్ పదర్శన ఇస్తున్నారు. అంతా ప్రదర్శనను ఎంతో ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఉన్నట్టుండి పైకప్పు కూలిపోయింది. ఆ సమయంలో క్లబ్‌లో 500 మంది నుంచి 1,000 మంది వరకూ ఉంటారని అంచనా. మృతి చెందిన వారిలో మురాంగే గాయకుడు రూబీపెరెజ్ కూడా ఉన్నారు. ఆయన మృతదేహాన్ని బుధవారం కనుగొన్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం అక్కడ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు స్థానిక మీడియా నివేదించింది.

# జాక్ రివ్యూ



శిల్పి గొప్పవాడైతే ఎలాంటి రాయినైనా శిల్పంగా మార్చేస్తాడు. అలా చెక్కిన శిల్పాలు గుళ్లో విగ్రహాలుగా మారి పూజలూ అందుకొంటాయి. సగం చెక్కిన శిల్పాలే.. అవి రాయిగానూ ఉండవు. ఓ రూపాన్నీ సంతరించుకోవు. ఎటూ కాకుండా మిగిలిపోతాయ్. కొన్ని కథలూ అంతే. దర్శకుడు బాగా చెక్కితే_ _ _. శిల్పాలుగా మిగులుతాయి. లేదంటే శిథిలాలుగా మారతాయి. ఎందుకో 'జాక్' సినిమా చూస్తుంటే.. అదే గుర్తొస్తుంది. బొమ్మరిల్లు భాస్కర్ తీసిన సినిమా ఇది. ఆయనకంటూ ఓ స్టైల్ వుంది. ఇందులో హీరో.. సిద్ధు జొన్నలగడ్డ. ఆయనకంటూ ఓ స్టైల్ ఏర్పడింది. రెండింటినీ మిక్సీలో వేస్తే_ _ _. ఆ సినిమా ఎలాంటి రూపం సంతరించుకొంది? శిల్పమైందా, శిథిలంగా మారిందా? జాక్ అని పిలుచుకొనే పాబ్లో నెరోడా (సిద్ధు జొన్నలగడ్డ) కథ ఇది. తను చాలా టాలెంటెడ్. చిన్నప్పటి నుంచి ఏవేవో కావాలని కలలు కంటుంటాడు. క్రికెట్, ఫుట్ బాల్, టెన్నీస్ ఇలా అన్నీ ట్రై చేస్తాడు. కానీ కోచ్ చెప్పినట్టు వినడు. ప్రతీ ఆట ఆడడానికి తనకంటూ ఓ సెపరేట్ పంథా ఉంటుంది. అందుకే 24 కోచ్‌లు 'వీడ్ని ట్రైన్ చేయడం మా వల్ల కాదు' అని వదిలేస్తారు. ఇలాంటి వాడు.. 'రా' ఏజెంట్ కావాలనుకొంటే ఎలా ఉంటుంది? అనేదే కథ. హైదరాబాద్ తో సహా దేశంలోని నాలుగు ప్రధాన నగరాల్లో విధ్వంసం సృష్టించడానికి ఉగ్రవాదులు ఓ ప్లాన్ వేస్తారు. దాన్ని ఛేదించడానికి `రా` రంగంలోకి దిగుతుంది. ఈ మిషన్‌కి హెడ్ మనోజ్ (ప్రకాష్‌రాజ్). రా పరీక్షలు రాసి, ఇంటర్వ్యూ ఫేస్ చేసి రిజల్ట్ కోసం ఎదురు చూస్తుంటాడు జాక్. ఈలోపు ఖాళీగా ఉండడం ఎందుకని, దేశాన్ని కాపాడే మిషన్స్ కూడా చేస్తుంటాడు. అందులో భాగంగా మనోజ్ చేస్తున్న మిషన్‌ని ముందే పసిగట్టి, ఉగ్రవాదుల్ని పట్టుకొనేందుకు ప్లాన్ వేస్తాడు. మరి జాక్ ఈ మిషన్ లో ఎంత వరకూ సక్సెస్ అయ్యాడు? 'రా'లో తనకు చోటు దక్కిందా? అనేది మిగిలిన సినిమా. 'వీడు కొంచెం క్రాక్' అనేది ఈ సినిమా ట్యాగ్ లైన్. దానికి తగ్గట్టుగానే ఇందులో హీరో క్యారెక్టర్ ని డిజైన్ చేశాడు భాస్కర్. ఓ రూల్ ప్రకారం, థియరీ ప్రకారం కాకుండా అడ్డదిడ్డంగా తన పనుల్ని తాను చేసుకొంటూ వెళ్లిపోయే హీరో కథ ఇది. నిజానికి ఇంట్రస్టింగ్ పాయింటే. సినిమాకి పనికొచ్చే విషయం ఉంది. భాస్కర్ చెప్పిన 'రాయి — శిల్పం' థియరీ ప్రకారం_ _ _ బొమ్మరిల్లు భాస్కర్ దగ్గర శిల్పం చెక్కడానికి అనువైన రాయి అయితే వుంది. అయితే_ _ _ దాన్ని శిల్పంగా మార్చే క్రమంలో చాలా తప్పులు చేశాడు. పోలీసులు దేశంలో లోపల ఉంటారు. సైన్యం సరిహద్దు బయట ఉంటుంది. ఒక్క 'రా' ఏజెంట్ మాత్రమే దేశానికి ముందు ఉండి ప్రమాదాన్ని రాకుండా ఆపుతాడు అంటూ 'రా' గురించి గొప్పగా ఒక్క ముక్కలో చెప్పేశాడు భాస్కర్. 'రా' గొప్పదనం అది. అయితే_ _ _ అంత గొప్ప వ్యవస్థని ఏదో ఆట వస్తువుగా చూపించడం మాత్రం హర్షించదగిన పరిణామం కాదు. 'రా' చేయలేని పనుల్ని ఛేదించలేని విషయాల్ని, తెలుసుకోలేని సంగతుల్ని ఒక ఆకతాయి చేస్తూపోవడం 'రా' గొప్పదనం అనుకొంటే ఎలా? ఉగ్రవాదుల్ని పట్టుకోవడానికి రా రంగంలోకి దిగుతుంది. అదే ఉగ్రవాదుల్ని హీరో వెంటాడుతుంటాడు. ఆ హీరోని హీరోయిన్ వెంబడిస్తుంటుంది. సినిమా అంతే ఇదే ఫ్లో. దేశాన్ని కాపాడడమే జాక్ లక్ష్యం అయినప్పుడు తానెందుకు.. 'రా'కి సహాయం చేయకూడదు? ఆ క్రెడిట్ తన జేబులోనే వేసుకోవాలని ఎందుకు చూస్తుంటాడు? 'రా'లో ఎంట్రీ ఇంత సులభమా? ఇలాంటి ప్రశ్నలు సినిమా చూస్తున్నంత సేపూ ప్రేక్షకుల్ని వెంటాడుతుంటాయి. మనోజ్ (ప్రకాష్ రాజ్) పాత్ర అటు సీరియస్ గా ఉండదు. అలాగని.. బఫూన్‌లానూ కనిపించదు. రెండింటికి మధ్య ఊగిసలాడుతుంటుంది. ఈ సినిమా కూడా అంతే. సుబ్బరాజు పాత్ర కూడా అంతే. తనో ఐఏఎస్ ఆఫీసర్. 'రా' ఏజెంట్ అవుదామనుకొంటాడు. ఐఏఎస్ ఆఫీసర్.. 'జాక్' చెప్పినట్టు ఆడుతుంటాడు. డిపార్ట్మెంట్ లోని సీరియస్ నెస్ 'జాక్'కి అర్థం కాదంటే ఓ అర్థం కాదు. కానీ_ _ _ ఓ ఐఏఎస్ ఆఫీసర్‌కు తెలియకపోవడం ఏమిటి? 'నువ్వు సెలవు పెట్టి నాతో వచ్చేయ్.. మనం ఇక నుంచి `రా` ఏజెంట్స్' అని జాక్ చెప్పగానే ఏమాత్రం ఆలోచించకుండా తలాడించుకొంటూ వచ్చేస్తాడు. సిల్లీగా. రా, ఉగ్రవాదం ఇలాంటి కథల్ని ఎంత సీరియస్‌గా చెబితే ఆ కథలోని డెప్త్ అంత త్వరగా అర్థం అవుతుంది. కానీ ఈ సినిమాని చాలా సిల్లీగా తీసుకొంటూ వెళ్లారు. దాంతో ప్రేక్షకులకూ కథలోని సీరియస్ నెస్ పట్టదు. 'ఏదో జరుగుతోందిలే' అనే ఫీలింగ్ తప్ప.. 'ఏం జరగబోతోందో' అనే ఉత్కంఠత కలగదు. ప్రేక్షకులకు టైమ్ పాస్ ఇస్తూ, వినోదాన్ని పంచడమే దర్శకుడి లక్ష్యం అయితే ఈ సినిమాని పూర్తిగా 'టిల్లు' స్టైల్ లో తీసేయాల్సింది. దానికి భాస్కర్ మనసు ఒప్పుకోలేదు. అలాగని సిద్దుకున్న ఇమేజ్‌ని వాడుకోకుంకుండా ఉండలేడు. అందుకే మధ్యమధ్యలో 'టిల్లు' వస్తూ పోతూ ఉంటాడు. అన్నట్టు ఈ సినిమాలో 'టిట్లు' రిఫరెన్సులు కూడా కొన్ని ఉన్నాయ్. కానీ అవన్నీ నాన్ సింక్‌గా తయారయ్యాయి. క్లైమాక్స్ ఫైట్ తో సిద్దుకు ఓ యాక్షన్ ఇమేజ్ ఇవ్వడానికి ప్రయత్నించారు. అది అంతగా వర్కవుట్ అవ్వలేదు. నేపాల్ లో సీన్లన్నీ అటు కాలక్షేపాన్నీ ఇవ్వలేదు. అలాగని డ్రామానీ పండించలేదు. సిద్దు జొన్నలగడ్డ అనగానే డీజే టిల్లుగా తాను పంచిన వినోదం గుర్తొండిపోతుంది. ఆ ఇమేజ్ తనకెంత వరమో, అంత శాపం కూడా. సిద్దు పాత్రలు అంత ఎనర్జిటిక్‌గా ఉంటే తప్ప ఎక్కవు. అక్కడక్కడ టిల్లు పాత్రని గుర్తు చేసేలా బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ మార్చుకొంటూ వెళ్లాడు. ఆయా సీన్లు కాస్త నవ్విస్తాయి. మిగిలిన చోట్ల సిద్దు దొరికిపోతాడు. ఈ సినిమాకు 'జాక్' అని కాకుండా `టిల్లు 3` అని పెట్టి, టిల్లు పాత్రనే `రా` ఏజెంట్ గా చేసేస్తే బాగుండేదేమో అనిపిస్తుంది. 'బేబీ' తరవాత వైష్ణవి చైతన్యకు పెద్దగా హిట్లు లేవు. తన సినిమాలేం గుర్తు పెట్టుకొనేలా లేవు. 'జాక్' సైతం ఎంత త్వరగా మర్చిపోతే అంత మంచిది. భాస్కర్ సినిమాల్లో హీరోయిన్ పాత్రలు బాగుంటాయన్న పేరుంది. ఆ పేరుకి కనీస న్యాయం జరగలేదు. ప్రకాష్ రాజ్ పాత్ర కూడా అలానే తయారైంది. ఈ సినిమాకు కర్త కర్మ క్రియ అన్నీ బొమ్మరిల్లు భాస్కర్. తన మార్క్ ఏమాత్రం కనిపించని సినిమా ఇది. అలాగని ఈ సినిమాని సిద్దు స్టైల్ కి తగ్గట్టుగా కూడా తీయలేకపోయారు. దానికి కారణాలేంటి అనేది భాస్కర్‌కే తెలియాలి. టైటిల్ సాంగ్ బాగుంది. కానీ గుర్తు పెట్టుకొనేలా లేదు. పాటలకు పెద్దగా స్కోప్ లేదు. నేపథ్య సంగీతంలోనూ మెరుపులేం కనిపించలేదు.




## ఏప్రిల్ 12న విశ్వంభర నుంచి

# ఫస్ట్ సింగిల్

టాలీవుడ్ నుంచి వస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియన్ మూవీలలో విశ్వంభర ఒకటి. ఈ సినిమా కోసం మెగా అభిమానులతో పాటు మూవీ లవర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే గత ఏడాది దసరా కానుకగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేయగా.. మంచి రెస్పాన్స్ వచ్చింది. అయితే తాజాగా ఈ సినిమా నుంచి కీలక అప్‌డేట్‌ను వెల్లడించారు మేకర్స్. ఈ మూవీ నుంచి ఫస్ట్ సింగిల్‌ను ఏప్రిల్ 12న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. రామ రామ అంటూ ఈ ఫస్ట్ సింగిల్ రాబోతుండగా.. ఈ సందర్భంగా బాల హనుమాన్‌లతో చిరంజీవి ఉన్న కొత్త పోస్టర్‌ను పంచుకుంది. మరోవైపు ఈ సినిమా విడుదల తేదీని త్వరలోనే విడుదల చేయబోతున్నట్లు తెలుస్తుంది. సోషియో ఫాంటసీ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు బింబిసార' ఫేమ్ వశిష్ట దర్శకత్వం వహిస్తుండగా.. కోలీవుడ్ స్టార్ హీరోయిన్ త్రిష కథానాయికగా నటిస్తుంది. యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ విక్రమ్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి బ్యాక్ గ్రౌండ్ స్కోర్, సంగీతం అందిస్తున్నారు.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# గుడ్ బ్యాడ్ అగ్లీ రివ్యూ




తమిళ స్టార్ అజిత్ కుమార్ మరోసారి తన అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నంలో "గుడ్ బ్యాడ్ అగ్లీ" అనే సినిమా ద్వారా ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఈ సినిమాకు ఆధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహించారు. "త్రిషా ఇల్లనా నయనతార", "మార్క్ ఆంటోని" వంటి చిత్రాలకు దర్శకుడిగా పేరున్న ఆధిక్, ఈసారి అజిత్‌తో కలిసి మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌ను తెరపైకి తీసుకొచ్చారు. మరి ఈ సినిమా ఎలా ఉందో ఒకసారి చూద్దాం.. గుడ్ బ్యాడ్ అగ్లీ చిత్రం కథ 'రెడ్ డ్రాగన్ AK' అనే పేరుతో మాఫియా డాన్‌గా వెలుగొందే (అజిత్) చుట్టూ తిరుగుతుంది. తన కుటుంబం కోసం క్రిమినల్ లైఫ్‌కి గుడ్‌బై చెప్పిన అతను, తన కొడుక్కి గర్వపడేలా జీవించాలని మాటిస్తాడు. కానీ కొడుకు ప్రమాదంలో పడినప్పుడు..అతన్ని రక్షించేందుకు మళ్లీ మాఫియా ప్రపంచంలోకి అడుగుపెడతాడు. ఫ్యామిలీని తిరిగి కలిపే ప్రయత్నంలో, అతని జీవితం మరోసారి మలుపు తిరుగుతుంది. ఇక ఆ తర్వాత ఏమైంది అనేది సినిమా కథ. అజిత్ ప్రధాన పాత్రలో ఆకట్టుకున్నాడు. స్టైల్, స్వాగ్ పరంగా ఆయన అభిమానులను మెప్పించే విధంగా నటించారు. అయితే పాత్రలో అంతగా భావోద్వేగాల లోతు ఉండకపోవడంతో..సాధారణ ప్రేక్షకులకు పెద్దగా కనెక్ట్ కాదు. త్రిషా పాత్ర చిన్నదే. గుర్తుండిపోయేంత ప్రాభవం కూడా ఏమి చూపించలేదు. ఆమె గ్లామర్ కూడా ఈ సినిమా కోసం పనిచేయలేదు. సునీల్, రాహుల్ దేవ్, యోగిబాబు, ప్రశన్న, ప్రభు, సిమ్రన్ వంటి ఇతర నటుల పాత్రలు పెద్దగా ఆకట్టుకోవు. అర్జున్ దాస్ పాత్ర మాత్రం కొంతంతవరకు మెప్పించింది. ఈ కథకి ఎమోషనల్ బేస్ ఉన్నప్పటికీ.. కథను నడిపించిన తీరు మాత్రం.. ఒక సాధారణమైన పాత కథను తలపిస్తుంది. GV ప్రకాష్ అందించిన సంగీతం.. పాటల విషయంలో పెద్దగా ఆకట్టుకోకపోయినా, బ్యాక్గ్రౌండ్ స్కోర్ మాత్రం సినిమాకు హైలైట్ గా నిలిచింది. ముఖ్యంగా స్లో మోషన్ సీన్లలో ఈ సంగీతం చాలా బాగుంది. సినిమాటోగ్రఫీ చేసిన అబినందన్ రామానుజం పనితీరు బాగుంది. విజువల్స్ క్వాలిటీగా ఉండేలా.. ఆయన చేసిన కృషి స్పష్టంగా కనిపిస్తుంది. ఎడిటింగ్ పరంగా విజయ్ పనితీరు పరవాలేదు అనిపించుకుంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణ విలువలు అద్భుతంగా ఉన్నాయి. దర్శకుడు అధిక్ రవిచంద్రన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. కథ ముందే అంచనా వేయదగినదిగా ఉండటంతో, ప్రేక్షకులను ఆశ్చర్యపరచడంలో దర్శకుడు విఫలమయ్యారు. దాదాపు కాసేపటికి సినిమా కథ మొత్తం అయిపోతుంది. హీరో ఎలివేషన్, స్లో మోషన్ షాట్స్‌పై అధికంగా ఫోకస్ చేయడం వల్ల, సినిమా లోతులేని విధంగా మారింది. ముఖ్యంగా కే జి ఎఫ్ లో లాగా ప్రతి 15 నిమిషాలకు ఒక ఎలివేషన్స్ సీన్ మాత్రం వస్తుంది. అది పక్కన పెడితే..ఎమోషనల్ ఎలిమెంట్స్, ముఖ్యంగా కొడుకుతో ఉన్న బంధం, తల్లి పాత్ర లాంటి అంశాలు సరైన ఫోకస్ లేకుండా పోయాయి. దర్శకుడు ప్రణాళికలు బాగున్నా, మొత్తం మీద మాత్రం సినిమా కేవలం పరవాలేదు అనిపించుకుంది.గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమా అజిత్ అభిమానుల కోసం మాత్రమే రూపొందినట్లు అనిపిస్తుంది. సామాన్య ప్రేక్షకులకు ఇది ఓవరాక్షన్, ఓవర్‌స్టైల్‌గా అనిపించవచ్చు. కథలో కొత్తదనం లేకపోవడం, ఎమోషనల్ డెప్త్ లోపించటం వల్ల సినిమా అంతగా కనెక్ట్ కాలేకపోయింది. టెక్నికల్‌గా బాగున్నా, కథా పరంగా వెనకబడిన సినిమా ఇది.



## రొమాంటిక్ మెలోడీ దర్శనమే సాంగ్ రిలీజ్

చార్మింగ్ స్టార్ శర్వానంద్, అందాల భామలు సంయుక్త మీనన్, సాక్షి వైద్య హీరోహీరోయిన్లుగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'నారీ నారీ నడుమ మురారి' ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమాను దర్శకుడు రామ్ అబ్బరాజు డైరెక్ట్ చేయగా, భాను బోగవరపు ఈ చిత్రానికి కథను అందిస్తున్నాడు. ఇక ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ అయిన పోస్టర్స్ ఈ మూవీపై మంచి బజ్ క్రియేట్ చేశాయి. తాజాగా ఈ సినిమాలోని ఫస్ట్ సింగిల్ సాంగ్ 'దర్శనమే' లిరికల్ వీడియోను మేకర్స్ రిలీజ్ చేశారు. రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాటను విశాల్ చంద్రశేఖర్ రొమాంటిక్ మెలోడీ ట్యూన్స్‌తో అదరగొట్టాడు. ఇక యాజిన్ నిజార్ తన వాయిస్‌తో ఈ పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చాడు. ఇక ఈ పాటను తెరకెక్కించిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఇందులో శర్వానంద్, సంయుక్త మధ్య కెమిస్ట్రీ ఆడియెన్స్‌కు రిఫ్రెషింగ్‌గా కనిపిస్తోంది.

## మరోసారి బన్నీతో జోడీగా..



అగ్ర కథానాయిక సమంత నటనతో పాటు సినీనిర్మాణంపై దృష్టి పెడుతూ బిజీగా ఉంది. మరోవైపు సోషల్‌మీడియాలో కూడా యాక్టివ్‌గా మారింది. ఇటీవలే ఈ అమ్మడు 'ఎక్స్'లోకి రీఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం సమంత స్వీయ నిర్మాణంలో రూపొందిస్తున్న 'మా ఇంటి బంగారం' అనే చిత్రంలో నటిస్తున్నది. రెండేళ్లక్రితం వచ్చిన 'ఖుషీ' తర్వాత పెద్ద చిత్రాలు చేయలేదు సమంత. ఈ ఏడాది మాత్రం భారీ ప్రాజెక్ట్స్‌లో భాగమయ్యేందుకు సిద్ధమవుతున్నదని తెలిసింది. తాజా సమాచారం ప్రకారం ఇటీవల ప్రకటించిన అల్లు అర్జున్-అట్లీ పాన్ ఇండియా చిత్రంలో సమంత కథానాయికగా నటించే అవకాశముందని చెన్నై ఫిల్మ్ సర్కిల్స్‌లో వినిపిస్తున్నది. ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్లకు చోటుంటుందట. మరో నాయికను బాలీవుడ్ నుంచి తీసుకుంటారని తెలుస్తున్నది. 'సన్నాఫ్ సత్యమూర్తి' సినిమాలో బన్నీతో జోడీగా నటించింది సమంత. ఆ తర్వాత 'పుష్ప'లో ప్రత్యేకగీతంలో ఆయనతో నర్తించింది. ఒకవేళ అట్లీ-బన్నీ ప్రాజెక్ట్‌లో సమంత నాయికగా ఖరారైతే ఇది వాళ్లిద్దరికి హ్యాట్రిక్ కాంబినేషన్ కానుంది. అయితే ఈ వార్తల్లో వాస్తవమెంతో తెలియాలంటే చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే అంటున్నారు.





## సంజూ శాంసన్‌కు 24 లక్షల జరిమానా

రాజస్తాన్ రాయల్స్ కెప్టెన్ సంజూ శాంసన్‌కు 24 లక్షల జరిమానా వేశారు. ఐపీఎల్‌లో బుధవారం గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్ రేటు కారణంగా ఆ ఫైన్ విధించారు. ఆ మ్యాచ్‌లో రాజస్తాన్ జట్టు 58 రన్స్ తేడాతో ఓడిపోయింది. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన నేపథ్యంలో ఆ జట్టుకు జరిమానా విధించారు. ఈ యేడాది ఐపీఎల్‌లో రెండోసారి ఆర్ఆర్ జట్టు స్లో ఓవర్ రేటుతో బౌలింగ్ చేసింది. చెన్నైతో జరిగిన మ్యాచ్ లో.. ఆర్ఆర్ స్టాండ్ ఇన్ కెప్టెన్ రియాన్ పరాగ్‌కు ఫైన్ పడ్డ విషయం తెలిసిందే. ఆ మ్యాచ్‌లో అతనికి 12 లక్షల ఫైన్ వేశారు. జట్టులోని ఇతర ఆటగాళ్లు, ఇంపాక్ట్ ప్లేయర్లకు ఆరు లక్షలు లేదా 25 శాతం మ్యాచ్ ఫీజులో కోత విధించనున్నారు. బ్యాటింగ్ , బౌలింగ్‌లో కొన్ని లోపాలు ఉన్నట్లు మ్యాచ్ ముగిసిన తర్వాత శాంసన్ తెలిపాడు.

## మూడేండ్ల కుమార్తెను చంపి.. తాను ఆత్మహత్య చేసుకున్న తల్లి

పెద్దపల్లి జిల్లా కేంద్రంలో విషాదం చోటుచేసుకుంది. మూడేండ్ల కూతురిని చంపిన ఓ మహిళ, అనంతరం తాను ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. జిల్లాలోని జూలపల్లి మండలం కేంద్రానికి చెందిన వేణుగోపాల్ రెడ్డి ఎల్ఐసీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. నాలుగేండ్ల క్రితం కరీంనగర్ జిల్లా వెధిర గ్రామానికి చెందిన సాహితీతో వివాహం జరిగింది. వారికి మూడేండ్ల కూతురు ఉన్నది. ప్రస్తుతం పెద్దపల్లి పట్టణంలోని టీచర్స్ కాలనీలో వేణుగోపాల్ రెడ్డి, లోక సాహితి రెడ్డి దంపతులు నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో బుధవారం వేణుగోపాల్ జగిత్యాలలోని తమ సమీప బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. దీంతో రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో సాహితి తన కూతురు రితన్యకు ఉరివేసి చంపేసింది. ఆ తర్వాత తాను కూడా ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడింది.





## బీహార్‌లో పిడుగుపాటుకు 21 మంది మృతి

రాష్ట్రంలో వర్ష బీభత్సం సృష్టించింది. ఈదురు గాలులు, వడగళ్ల వానలు రాష్ట్రంలోని పలు జిల్లాలను అతలాకుతలం చేశాయి. వర్షం కారణంగా అనేక చోట్ల పిడుగులు పడ్డాయి. ఈ పిడుగుల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 21 మంది ప్రాణాలు కోల్పోయారు.బెగుసరాయ్, దర్భంగా జిల్లాల్లో ఐదుగురు చొప్పన, మధుబనిలో నలుగురు, ఔరంగాబాద్, సమస్తిపూర్, సహర్సా నుంచి ఇద్దరు చొప్పన, ఔరియ్యలో ఒక్కరు.. మొత్తం 21 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై సీఎం నితీశ్ కుమార్ విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. అంతేకాదు మృతుల కుటుంబాలకు రూ.4 లక్షలు (ఒక్కో కుటుంబానికి) ఇస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, వర్షం పడుతున్న సమయంలో బహిరంగ ప్రదేశాలకు వెళ్లకుండా ఇంటిపట్టునే ఉండాలని సూచించారు.